రహదారి విస్తరణకు శ్రీకారం

- హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన
- మొదటి విడతగా రూ.20 లక్షలతో రోడ్డు వెడల్పు



జాతీయ రహదారి నుంచి హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి వరకు రహదారి



విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, కార్పొరేటర్ వరలక్ష్మి (ఫైల్)

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు జాతీయ రహదారి ఇ.మర్రిపాలెం కూడలి నుంచి హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి రహదారి విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. మొదటి విడతగా రూ.20లక్షలతో రహదారి విస్తరణకు చర్యలు చేపట్టారు. జీవీఎంసీ రూ.3 కోట్లతో డబుల్ లైన్ రహదారి విస్తరణకు ప్రతిపాదనలు చేసింది. అయితే మొదటి ప్రాధాన్యతగా క్యాన్సర్ ఆస్పత్రి రోగుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా రహదారికి కుడివైపున రెండు మీటర్ల మేరకు రహదారిని సీసీ రోడ్డుగా నిర్మించే పనులు ప్రారంభించారు. హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి మీదుగా ఫార్మాసిటీ కాలనీలు, ఏడు మెట్ల మర్రిపాలెం వరకు రహదారి విస్తరణ చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈమేరకు ప్రతిపాదనలు చేయడం, మొదటి విడతగా ప్రస్తుతం ఉన్న రహదారికి కుడివైపున సీసీరోడ్డుగా విస్తరించే పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి రెండు రోజుల క్రితం శంకుస్థాపన చేశారు. రహదారిలో రెండు ప్రమాదకరమైన మలుపులు ఉండడంతో వాహనచోదకులు బిక్కుబిక్కుమంటూ వాహనాలు నడపాల్సివస్తుంది. అలాగే ఈ మార్గంలో ముందు వరుసలో లారీలు, బస్సులు ప్రవేశిస్తే ఇతర వాహనాలు ఓవర్‌టేక్ చేయడానికి వీలులేని విధంగా రహదారి ఇరుక్కుగా ఉంది. క్యాన్సర్ ఆస్పత్రికి రోజూ మూడు వందల మంది రోగులు, వారి సహాయకులు వాహనాలపై వస్తున్నారు. మలుపులు దాటిన తరువాత ఔట్‌గేటు ఉండడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అలాగే 8 ఫార్మాసిటీ కాలనీలతోపాటు ఆనుకొని రెండు గ్రామాలు ఉన్నాయి. ఒక ఇంజినీరింగ్ కళాశాల, ప్రైవేటు పాఠశాలలు ఉండడంతో ఇరుకు రోడ్డులో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో రహదారి విస్తరణ పనులకు శ్రీకారం చుట్టడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రహదారి కష్టాలు తీరనున్నాయి

హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి ఔట్ గేటుకు చేరుకోవాలంటే రెండు మలుపులతోపాటు రహదారి ఇరుగ్గా ఉన్న కారణంగా వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుండడంతో మలుపుల వద్ద ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మేయర్, కమిషనర్, ఎమ్మెల్యేల దృష్టికి సమస్యను తీసుకువెళ్లడంతో ముందుగా రూ.20లక్షలతో రహదారికి ఒకవైపు విస్తరణ పనులు చేపడుతున్నారు.

–ఇల్లపు వరలక్ష్మి, కార్పొరేటర్ 85వ వార్డు

డబుల్ రోడ్డుగా విస్తరించాలి..

రహదారి విస్తరించడం వల్ల కొద్దిపాటి సమస్య పరిష్కారమైనట్టే. అయితే డబుల్ రోడ్డుగా విస్తరిస్తే వేలాది మంది స్థానికులు, ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు సౌకర్యవంతంగా ఉంటుంది. జీవీఎంసీ మేయర్, గాజువాక ఎమ్మెల్యే స్పందించి డబుల్ రోడ్డుగా విస్తరించేలా చర్యలు తీసుకోవాలి.

–రామారావు, ఫార్మాసిటీ కాలనీ

'జగన్‌ను మళ్లీ సీఎంను చేసుకుంటాం'

జిల్లా టైలర్స్ అసోసియేషన్



మంత్రి అమర్‌నాథ్‌తో జిల్లా టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: చేదోడు పథకం ద్వారా టైలర్స్ సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి రాష్ట్ర వ్యాప్తంగా టైలర్స్ అందరు రుణపడి ఉంటామని జిల్లా టైలర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అతికినిశెట్టి సత్యనారాయణ అన్నారు. ఆదివారం 68వ వార్డు మిందిలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా టైలర్లకు పనులు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందజేస్తున్న స్కూల్ యూనిఫారాలు కూడా స్థానిక టైలర్లచే కుట్టించుకోవాలని ఆదేశించడంతో టైలర్లకు పనికి లోటు లేకుండా ఆర్థికంగా ప్రభుత్వం సహకారం అందించిందని కొనియాడారు. జగన్‌మోహన్ రెడ్డికి తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. తిరిగి ఆయనను ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి టైలర్స్ అంతా సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూనూరు మల్లికేశ్వరరావు, న్యాయసలహాదారు టి.పుల్లయ్య నాయుడు, ప్రతినిధులు తిరుపతి ప్రసాద్, దొడ్డి శ్రీను, బి.గంగరాజు, కె.శ్రీనివాస్, వెంకటరమణ, టి.ప్రసాద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనగర్ వాకర్స్ పార్కులో స్వచ్ఛతా హీ సేవ



వాకర్స్ పార్కును శుభ్రం చేస్తున్న తిరుమలనగర్ అసోసియేషన్ సభ్యులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమలనగర్ వాకర్స్ పార్కులో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని తిరుమలనగర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా వాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేయడంతో పాటు ఇంకుడు గుంతలను క్లీయర్ చేసి, ఓపెన్ జిమ్ పరికరాలను శుభ్రపరిచారు. చెట్లు కొమ్మలు, పార్కులో పిచ్చి మొక్కలను తొలగించి పార్కును అహ్లాదకరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలన్నారు. నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్‌ను నియంత్రించాలని, ప్లాస్టిక్‌కు బదులు క్లాత్ బ్యాగులు, స్టీల్ బాక్సులు వాడాలన్నారు. తడి చెత్త–పొడి చెత్తను వేరు వేరు పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, అప్పలనాయుడు, వర్మ, రాము, సన్యాసిరావు, వసంతరెడ్డి, కృష్ణ, భద్రరావు, భాస్కరరావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మినీ కల్యాణ మండపం పనుల పరిశీలన



మినీ మండపం పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

పెదగంట్యాడ: మినీ కల్యాణ మండపం నిర్మాణం నాణ్యత విషయంలో రాజీపడవద్దని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి సూచించారు. వార్డు పరిధిలోని దయాల్‌నగర్ ఏరియాలోని క్వారీ రోడ్డులో ఉన్న స్వర్ణ నూకాంబిక అమ్మవారి ఆలయ ఆవరణలో కొత్తగా నిర్మిస్తున్న మినీ కల్యాణ మండపం నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉంటున్న వారి కోసం ఈ మండపం నిర్మిస్తున్నామని చెప్పారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

కారు బోల్తా - డ్రైవర్‌కు స్వల్ప గాయాలు



బోల్తా పడిన కారు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం ఉదయం కారు బోల్తా పడిన సంఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. కూర్మన్నపాలెం సైమన్ నగర్‌కు చెందిన యువకుడు తెల్లవారి దేశపాత్రుని పాలెం వైపు నుంచి కూర్మన్నపాలెం వైపు కారులో వస్తున్నాడు. సెక్టార్–10 కూడలి వద్దకు వచ్చేసరికి కారు అదుపు తప్పి బోల్తా కొట్టి సమీప తుప్పల్లోకి దూసుకుపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణాపాయం కలుగలేదు. ఈ సంఘటనలో స్వల్పంగా గాయపడిన డ్రైవర్ అక్కడ నుంచి వెళ్లి పోయాడు. స్టీల్‌ప్లాంట్ సీఐ వి. శ్రీనివాసరావు నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



ట్రాక్‌పై మృతదేహం

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలోని లంకెపాలెం వద్ద కదులుతున్న రైలు నుంచి జారి పడిన వ్యక్తి మృతి చెందాడు. దువ్వాడ జీఆర్‌పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం పది గంటల సమయంలో లంకెలపాలెం సమీపంలో కదులుతున్న రైలు నుంచి జారిపడిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. మృతుడు ఐదున్నర అడుగుల ఎత్తు, నీలిరంగు టీషర్ట్, నలుపురంగు గళ్ల లుంగీ ధరించి ఉన్నట్టు వారు తెలిపారు. వివరాల కోసం దువ్వాడ రైల్వేస్టేషన్‌లోని ఔట్‌పోస్ట్‌లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా హోలీ క్రాస్ చర్చి వేడుకలు



ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

గాజువాక: పాతగాజువాకలోని హోలీ క్రాస్ చర్చి వార్షిక వేడుకను ఘనంగా నిర్వహించారు. పునీత యూదా తద్దేయి పేరిట ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ ఆర్బీ ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుక సందర్భంగా దశమికొండ కాలనీ, చిట్టినాయుడు కాలనీ, పల్లావారి వీధి, పాతగాజువాక జంక్షన్ మీదుగా పంతులుగారి మేడ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భారీ సంఖ్యలో క్రీస్తు విశ్వాసులు పాల్గొన్నారు.

బడిపిల్లలతో రచయితలు



రచనలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రచయిత్రి




విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: విద్యార్థుల్లో ఉన్న పఠనాసక్తిని, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని పలువురు రచయితలు పేర్కొన్నారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక, మరో గ్రంథాలయం ఉద్యమం సహకారంతో బడిపిల్లలతో రచయితలు అనే కార్యశాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో సాహితీ సృజనను పదును పెట్టేందుకు ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. పాఠ్య పుస్తకాలే కాకుండా సాహిత్య పుస్తకాల పట్ల కూడా విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని వివరించారు. ప్రముఖ రచయితలతో విద్యార్థినీ విద్యార్థులను అనుసంధానం చేసి, వారికున్న సందేహాలను నివృత్తి చేస్తున్నామన్నారు. అలాగే కథలు, నవలలు, కవితలు ఎలా రాయాలో వివరిస్తున్నామని తెలిపారు. రచనా వ్యాసంగంపై పట్టుసాధించేలా విద్యార్థులకు మెళకువలు నేర్పిస్తున్నామని చెప్పారు. పఠనాసక్తి, కవితలు, పద్యాలు, నవలలు తదితర సాహిత్యాన్ని రాయాలనే ఆసక్తి ఉన్న 30 మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. ఐదుగురు విద్యార్థులకు ఒక రచయితతో రచనల్లో తర్ఫీదు ఇస్తున్నామని తెలిపారు. మరో గ్రంథాలయ ఉద్యమం ఉత్తరాంధ్ర కన్వీనర్ బి.వెంకటపతిరాజు (వేణు), ప్రజా స్వామిక రచయిత్రుల వేదిక జాతీయ కన్వీనర్, ప్రముఖ రచయిత్రి మల్లీశ్వరి, రచయితలు రెడ్డి రామకృష్ణ, మెగా శ్రీనివాస్, పీవీఆర్ లక్ష్మీనరసమ్మ, ఎస్.సూర్యకుమారి, మీగడ వీరభద్రస్వామి, పి.అమరజ్యోతి విద్యార్థులకు మెళకువలు నేర్పించారు.

ఎమ్మెల్యే నాగిరెడ్డి అభినందనలు

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారి మంచి రచయితలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం అభినందనీయమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పాఠశాలల్లో సాహిత్య కార్యశాల నిర్వహించడంపై సంతోషం వ్యక్తం చేశారు. అలాగే విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సాహిత్యంపై పట్టు సాధించేలా విద్యార్థులు సాధన చేయాలన్నారు. అనంతరం వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భవానీ శంకర్, ఎం.శివ, ఎం.నాగమణి, ధనలక్ష్మి, చంద్రకళ, రమేష్, అప్పలరాజు, నారాయణరావు పాల్గొన్నారు.

సత్వర న్యాయ సేవలే లోక్ అదాలత్ లక్ష్యం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వల్లభు నాయుడు

ఉక్కునగరం: ప్రజా ప్రయోజిత, న్యాయ సేవలు సత్వరం అందించడం లోక్ అదాలత్ లక్ష్యమని జిల్లా జడ్జి , శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.వల్లభు నాయుడు అన్నారు. ఉక్కునగరం సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం లోక్ అదాలత్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ న్యాయ సేవ అధికార సంస్థల చట్టం 1987 సెక్షన్ 22ఎ (బి)ను అనుసరించి శాశ్వత లోక్ అదాలతో ఏర్పాటు చేశార్నారు. ప్రజోపయోగ సేవకు సంబంధించి కోటి రూపాయల విలువ మేరకు వివాదాలను పరిష్కరించే అధికారం దీనికి ఉందన్నారు. ఇందులో ఎటువంటి రుసుం చెల్లించకుండా న్యాయం పొందవచ్చన్నారు. ఈ తీర్పును హైకోర్టులో మాత్రమే ప్రశ్నించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు అబ్దుల్ అసరాఫ్, జి. సత్యనారాయణ, వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తదితరులు పాల్గొన్నారు.

990వ రోజుకు ఉక్కు దీక్షలు



990వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు విషయంలో కార్మికులను రోడ్డున పడే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అమానుషమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 990వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో ఆదివారం సంస్థకు చెందిన వలు విభాగాల కార్మికులను పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల సంపదైన విశాఖ ఉక్కును కాపాడుకోవడం కోసం దేశ వ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధమన్నారు. కొత్త ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేయలేని కేంద్ర ప్రభుత్వానికి ఉన్న పరిశ్రమలను అమ్మే హక్కు లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ శక్తులకు కట్టబెడితే చూస్తు ఊరుకోమని, పార్లమెంట్ సమావేశాల్లో విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామనే ప్రకటన చేయాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విరివిగా సేవా కార్యక్రమాలు



మాట్లాడుతున్న కృష్ణదేవరాయ సేవా సంఘం అధ్యక్షుడు ముత్యాలు

అగనంపూడి: కాపుల్లో సామాజిక చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నామని శ్రీకృష్ణదేవరాయ గాజువాక కాపు సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. అగనంపూడిలోని హనుమాన్ ఆలయంలో కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సేవా సంఘం ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు వివరించారు. తరువాత కాపు సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న వన సమారాధనపై అభిప్రాయాలు సేకరించారు. వెంకటరమణ, అప్పారావు, దుల్లా చెల్లారావు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధిత చిన్నారికి ఆర్థిక సాయం



చిన్నారి తల్లిదండ్రులకు నగదును అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: క్యాన్సర్‌తో ఇబ్బంది పడుతున్న చిన్నారి సబ్బ డిస్మితకు అగనంపూడికి చెందిన నాయకుడు బలిరెడ్డి నాగేశ్వరరావు రూ. పది వేలు సహాయంగా అందించారు. పరవాడ మండలం భరణికం గ్రామానికి చెందిన డిస్మిత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతోంది. చిన్నారి చికిత్స కోసం తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులు అగనంపూడికి చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ సలహాదారు పట్టా రామ అప్పారావు దృష్టికి తీసుకువెళ్లడంతో తన మిత్రుల బృందం రూ.20వేల వరకు సహాయం అందించారు. రామా అప్పారావు పిలుపు మేరకు నాగేశ్వరరావు స్పందించి అగనంపూడి హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని పరామర్శించి ఆమె తల్లిదండ్రులకు సాయాన్ని అందించారు. కార్యక్రమంలో దాత బలిరెడ్డి నాగేశ్వరరావు, భరణికం సర్పంచ్ శేఖర్, ట్రస్ట్ ప్రతినిధులు ఎం.మస్తాన్‌రెడ్డి, కె.హనుమంతురావు, గుదే సుశీలా గజేంద్రరావు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ

అక్కిరెడ్డిపాలెం: నవంబర్ 4వ తేదీన తుంగ్లాంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి తెలిపారు. ఆదివారం తుంగ్లాంలో రక్తదాన శిబిరం పోస్టర్‌ను యువకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరగనున్న రక్తదాన శిబిరంలో యువత పెద్దఎత్తున పాల్గొని రక్తదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానంతో ఎందరో ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. కార్యక్రమంల పలువురు యువత పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నవంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు నాక్ కమిటీ పర్యటన నేపథ్యంలో వర్సిటీలో జరుగుతున్న పనుల ప్రగతిపై రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ఆదివారం సమీక్షించారు. వివిధ విభాగాల అధికారులతో పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. రానున్న రెండు రోజుల్లో జరగాల్సిన పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. నాక్ కమిటీ పర్యటన ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనులు చేపడుతున్న అధికారులు ఆదివారం సైతం పూర్తి స్థాయిలో పని చేశారు. అన్ని విభాగాలను భాగస్వామ్యం చేస్తూ సమన్వయంతో పనిచేయాలని రిజిస్ట్రార్ ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కె.రమాసుధ, ఆచార్య ఎ.కె.ఎం.పవన్, ఆచార్య విజయ మోహన్, ఎస్.ఎం.యుగంధర్, ఎస్.హరనాథ్, కె.సీతామాణిక్యం, సాల్మన్ బెన్నీ పాల్గొన్నారు.

తిరుమల బాలాజీకి విశేష పూజలు



విశేష అలంకరణలో తిరుమల బాలాజీ



శ్రీదేవి, భూదేవి సహిత బాలాజీని ఊరేగిస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కొలువైన తిరుమల బాలాజీకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. శనివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సహిత తిరుమల బాలాజీ ఉత్సవ విగ్రహాలను అంగరంగ వైభవంగా ఊరేగించారు. వేకువ జామునే మందిరంలో తిరుమల బాలాజీ విశేష అంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల నేతృత్వంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

ఆసియన్ స్కేటింగ్ పోటీల్లో ఉక్కు క్రీడాకారుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న స్కేటింగ్ కోచ్‌లు అమిత్, గోపి, కాశీ

ఉక్కునగరం: ఆసియన్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో ఉక్కునగరం స్కేటింగ్ రింక్ క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు సాధించారు. ఈనెల 22 నుంచి 28వరకు చైనాలో 19వ ఆసియన్ రోలర్ స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. ఉక్కునగరం స్కేటింగ్ రింక్‌లో ప్రాక్టీస్ చేస్తున్న జాతీయ స్థాయి క్రీడాకారులు షైలేంద్ర సింగ్, ఆకాష్ కుమార్ ఘడాయ్, ఆకాంక్ష ఘడాయ్‌లు పాల్గొన్నారు. ఈ పోటీల్లో సీనియర్ ఇన్‌లైన్ పోటీల్లో ఆకాష్ కుమార్ ఘడాయ్, షైలేంద్ర సింగ్‌లు నాలుగవ స్థానం గెలుపొందగా, జూనియర్ ఇన్‌లైన్ హాకీ పోటీల్లో ఆకాంక్ష ఘడాయ్ కాంస్య పతకం గెలుపొందారు. చైనా నుంచి తిరిగి వచ్చిన విజేతలు ఆకాష్ కుమార్ ఘడాయ్, షైలేంద్ర సింగ్, ఆకాంక్ష ఘడాయ్‌లకు అధికారులు స్వాగతం పలికారు. కోచ్‌లు అమిత్ ఘడాయ్, గోపి, కాశీలకు విజేతలు కృతజ్ఞతలు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఎంతటి త్యాగాలకైనా సిద్ధం



ర్యాలీ చేస్తున్న శిష్టకరణాల అసోసియేషన్ సభ్యులు

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఎంతటి త్యాగాలకైన సిద్ధమని కూర్మన్నపాలెం శిష్టకరణాల అసోసియేషన్ కార్యదర్శి డి.సత్యారావు అన్నారు. ఉక్కు ఉద్యమం వెయ్యి రోజులుకు చేరుకుంటున్న సందర్భంలో నవంబర్ 8వ తేదీన చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతూ ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రాంతంలో నిర్మితమైంది కాబట్టే విశాఖ మరింత అభివృద్ధి చెందిందని, అదే విధంగా అన్ని వర్గాల వారికి ఉపాధి లభిస్తుందన్నారు. ప్లాంట్ కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు ఇంకా పూర్తి స్థాయిలో ఉపాధి లభించలేదని, వీరికి ఉపాధి కల్పించి న్యాయం చేసేవరకు ఉద్యమం ఆగదన్నారు. అధ్యక్షుడు పీఎస్ఎన్ గోపాల్ మాట్లాడుతూ ఉక్కు ఉద్యమంలో ప్రతి ఒక్కరు పాల్గొని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కూర్మన్నపాలెం శిష్టకరణాల సంఘం సభ్యులు తమ కుటుంబ సభ్యులతో ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రతినిధులు కె.రవీంద్ర, గర్భం నాగేశ్వరరావు, డబ్బీరు గురునాథరావు, డి.కృష్ణారావు, మానాపురం శ్రీనివాస పట్నాయక్, శేఖరమంత్రి వరలక్ష్మి, రామచంద్రరావు, ప్రసాదరావు, వెంకటేశ్వరరావు, గోపాలకృష్ణ, బీవీఎం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ బీఎంఎస్ నూతన కార్యవర్గం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీఎంఎస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సెక్టార్–2లోని యూనియన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సురేష్ కుమార్, ఆర్ఎస్ఎస్ నాయకులు కొండపల్లి రామారావు సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటైంది. టి. హనుమంతరావు గౌరవాధ్యక్షుడిగా, కొమ్మినేని శ్రీనివాసరావు అధ్యక్షుడిగా, కె.అప్పలరాజు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, ఎం. రామస్వామి ప్రధాన కార్యదర్శిగా, గురుప్రసాద్ ఉప ప్రధాన కార్యదర్శిగా, రాందాస్ నరేంద్ర కోశాధికారిగా ఎన్నిక కాగా ఐదుగురు ఉపాధ్యక్షులు, 9 మంది సంయుక్త కార్యదర్శులు, 10 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లను ఎన్నుకున్నారు.

